జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 77‖ బుధవారం‖ 12-8-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

12 ఆగస్టు 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:40 తిథి అమావాస్య రా. 11:09 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పుష్యమి ఉ. 7:58 వరకు తరువాత ఆశ్లేష యోగం వ్యతిపాత మ. 3:23 వరకు కరణం చతుష్పాద మ. 12:30 వరకు నాగవ రా. 11:09 వరకు వర్జ్యం రా. 7:46 నుండి రా. 9:14 వరకు దుర్ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:46 వరకు రాహుకాలం మ. 12:21 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 7:36 నుండి ఉ. 9:11 వరకు గుళికాకాలం ఉ. 10:46 నుండి మ. 12:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు తె. 4:36 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

## త్వరగా టెండర్లు పిలవాలి..

## రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్‌లు కొనాలి: రేవంత్

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశలో భాగంగా చేపట్టనున్న పాతబస్తీ మెట్రో పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన మెట్రో కారిడార్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు.

హైదరాబాద్, ఆగస్టు 11: హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్)పై ముఖ్యమంత్రి మంగళవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పాతబస్తీ మెట్రో పనుల పురోగతి, భూసేకరణ, రోడ్ల విస్తరణతో పాటు ప్రస్తుతం మెట్రో రైళ్లలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీపై సమావే శంలో (మిగతా 2వ పేజీలో)

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయండి



## ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి భారతీయుడు చురుకుగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. "హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా" అనే సందేశంతో దేశ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక (మిగతా 2వ పేజీలో)



## రూ.200 కోట్ల భూమి కేటాయింపుపై...

# సమగ్ర విచారణ జరపాలి

### రూ.లక్ష పెట్టుబడి.. ఉద్యోగులు సున్నా.. ఐదెకరాల భూమి ఎలా ఇచ్చారు?

### సీఎం సోదరుడితో సంబంధమున్న సంస్థకు రూ.7 కోట్లకే విలువైన భూమా?

### అన్ని పత్రాలను ప్రభుత్వం బయటపెట్టాలి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డితో సంబంధాలున్నట్లు చెబుతున్న 'టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్' సంస్థకు సుమారు రూ.200 కోట్ల విలువైన దాదాపు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడంపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు డిమాండ్ చేశారు. కేవలం రూ.లక్ష పెయిడ్‌అప్ క్యాపిటల్, ఒక్క ఉద్యోగి కూడా లేని సంస్థకు ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయించారని ఆయన ప్రశ్నించారు.

హైదరాబాద్, ఆగస్టు 11: మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 2025 మార్చి 31 నాటికి టెసరాక్ట్ సంస్థలో ఉద్యోగుల సంఖ్య సున్నాగా ఉందని, పెయిడ్‌అప్ క్యాపిటల్ కేవలం రూ.లక్ష మాత్రమేనని పేర్కొన్నారు. మార్కెట్ విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందని చెబుతున్న దాదాపు ఐదెకరాల భూమిని సుమారు రూ.7 కోట్లకే, చదరపు గజానికి దాదాపు రూ.3,700 చొప్పున కేటాయించారని ఆరోపించారు. "ఒక్క ఉద్యోగి కూడా లేని, రూ.లక్ష పెయిడ్ అప్ క్యాపిటల్ మాత్రమే ఉన్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల ప్రభుత్వ భూమి ఎలా దక్కింది? ఇది కుంభకోణం కాదా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. భూమి కేటాయింపునకు సంబంధించిన అన్ని వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, భూమి విలువ నిర్ధారణ, సంస్థ అర్హతల ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు, కల్పిస్తామని చెప్పిన ఉద్యోగాల సంఖ్య, నిర్ణయ ప్రక్రియలో పాల్గొన్న అధికారుల వివరాలను బహిర్గతం (మిగతా 2వ పేజీలో)



3

# యంగ్ ఇండియా పాఠశాలలతో పేదల కలలకు రెక్కలు

### ప్రపంచ స్థాయి విద్యే ప్రభుత్వ లక్ష్యం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



# తెలంగాణ ఓటర్లు..

# 2,64,87,214

### నమోదు కానివాళ్లు 73,39,234 మంది

### ఇందులో చనిపోయినవాళ్లు 9 లక్షలు

తెలంగాణలో సోమవారంతో సర్ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో మంగళవారం ఓటర్ల గణాంకాలను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. సర్ ప్రక్రియ కంటే ముందు.. తెలంగాణ ఓటర్లు మొత్తం 3,38,26,448 మంది. కాగా, సర్ ప్రక్రియ అనంతరం 2,64,87,214(78.30 శాతం) మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

హైదరాబాద్, ఆగస్టు 11 : రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య, ఎన్యుమరేషన్ ఫారాల స్థితిపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వివరాలను మంగళవారం మీడియాకు రిలీజ్ చేశారు. 'సర్ ఎన్యుమరేషన్‌లో 73,39,234(21.70 శాతం) మంది ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోలేదు. ఇందులో.. మరణించిన వారు -9,22,230, అన్‌ట్రెసబుల్ - 11,25,546, నివాస మార్పిడి - 45,18,961, ఇప్పటికే నమోదై తరువాయి 2 వ పేజీలో...



# మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్

### తీర్పుపై సోనియా గాంధీ స్పందన

### నిజాయతీకి న్యాయం జరిగింది

**న్యూఢిల్లీ, ఆగస్టు 11 (రుద్రన్యూస్) :**

బొగ్గు కుంభకోణం కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ స్పందించారు. భారత రాజకీయ చరిత్రలో ఈ తీర్పు ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్‌ను దేశం అత్యంత ప్రభావశీలమైన, మృదుస్వభావి ప్రధానిగా ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయాల్లో జరిగిన ఒక విషాదకర అధ్యాయానికి ముగింపు పడిందని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. నిజాయతీ, నైతిక విలువలకు ప్రతీకగా నిలిచిన మన్మోహన్ సింగ్‌ను దోషిగా చూపించేందుకు (మిగతా 2వ పేజీలో)



# ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

### ఆషాడ బోనాల వేడుకల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

### తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా మారు బోనం సమర్పణ

### బోనమెత్తిన మహిళలకు చీరె, సారె అందజేత

### ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారిని ప్రార్థించిన మంత్రి

2

ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం సమర్పించారు. భక్తిశ్రద్ధల నడుమ ఆలయానికి చేరుకున్న మంత్రికి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

# హర్ ఘర్ తిరంగా విజయవంతం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక రీల్‌ను పంచుకున్న ప్రధాని మోదీ, స్వాతంత్ర్య దినోత్స వాన్ని గర్వంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధి లక్ష్యమైన 'వికసిత్ భారత్' సాధనకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని, ఈ సందర్భంగా దేశాభివృద్ధికి కట్టుబడి ఉ ంటామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చూడాలని, ఈ కార్యక్రమాన్ని జాతీయ వేడుకగా మార్చాలని కోరారు. ఇటీవల సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా కూడా ప్రధాని మోదీ ప్రజలను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. త్రివర్ణ పతాకం కేవలం జెండా మాత్రమే కాదని, అది దేశ గౌరవానికి, ఐక్యతకు, సార్వభౌమాధికారానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశం కోసం అత్యుత్త మంగా సేవ చేయాలనే స్ఫూర్తిని జాతీయ పతాకం ప్రతి భారతీ యుడిలో నింపుతుందని తెలిపారు. దేశభక్తి భావనను మరింత బలపరచడంలో 'హర్ ఘర్ తిరంగా' కీలక పాత్ర పోషిస్తోంద న్నారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమా న్ని 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో 'వందేమాతరం'కు ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని గుర్తుచేస్తూ, ఆ స్ఫూర్తిని నేటి తరాలకు చేరవేయాలని సూచించారు. త్రివర్ణ పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమ, దేశభక్తి విలువలను ప్రజల్లో మరింతగా పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహిం చాలని అన్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. గ్రామాలు, పట్ట ణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాల యాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాయి. జాతీయ పతాకంతో ప్రతి కుటుంబానికి మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహి స్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా దేశభక్తి వాతావరణం నెలకొ ల్పడం, స్వాతంత్ర్య సమరయోధుల త్యా గాలను గుర్తుచేసుకోవడం, జాతీయ ఐక్య తను మరింత బలోపేతం చేయడం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన లక్ష్య మని అధికారులు పేర్కొంటున్నారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగుర వేసి దేశ గౌరవాన్ని చాటాలని ప్రధాని మోదీ మరోసారి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



# నేటి రాశి ఫలాలు

మేషం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగుల శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

వృషభం: చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

మిథునం: ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో ఋణ సమస్యలు నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉ ంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

సింహం: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలాకాలంగా వేదిస్తున్న సమస్యల నుండి బయటపడతారు.

తుల: నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారూలతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

వృశ్చికం: ఆదాయ మార్గలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉ ద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్థవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలలో మరింత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

మకరం: ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉ ద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

కుంభం: నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి.





## పెట్టుబడులే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్

**అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 11 (మన దీపం): రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

గ్లోబల్ సమ్మిట్ ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం ఉ న్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ నిర్వహణకు అవసరమైన కార్యాచరణను ముందుగానే సిద్ధం చేసుకుని, వివిధ రంగాలకు చెందిన దేశ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోని వివిధ సెక్టార్లలో విశేష గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ సందర్భంగా సన్మానించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ వేదికపై సమర్థంగా చాటిచెప్పే విధంగా సమ్మిట్ నిర్వహణ ఉ ండాలని పేర్కొన్నారు.

గత ఏడాది నిర్వహించిన సమ్మిట్ సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలు, వాటిలో ఇప్పటివరకు కార్యరూపం దాల్చిన ప్రాజెక్టులు, సాధించిన పురోగతికి సంబంధించిన సమగ్ర వివరాలను నివేదిక రూపంలో అందించాలని సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో పెట్టుబడులను మరింత పెంచడంతో పాటు కొత్త పరిశ్రమలు, వ్యాపార అవకాశాలను ఆకర్షించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

చర్చించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. మెట్రో విస్తరణకు అవసరమైన పెండింగ్ భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

రద్దీకి తగ్గట్టుగా అదనపు బోగీలు

హైదరాబాద్ మెట్రోలో రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సౌకర్యాలను విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మెట్రో రైళ్లకు అదనపు బోగీలను జతచేసేందుకు అవసరమైన కొత్త కోచ్‌ల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మెట్రో ఫేజ్-2లో ఎంజీబీఎస్--చాంద్రాయణగుట్ట 7.5 కిలోమీటర్ల కారిడార్ నిర్మాణానికి ఉపయోగించాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై ఢిల్లీ మెట్రో అధికారులను సంప్రదించి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర విచారణ జరపాలి

మొదటి పేజీ తరువాయి

చేయాలన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను కూడా కేటీఆర్ ప్రశ్నించారు. టెసరాక్ట్ సంస్థతో కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి చెబుతున్నారని, అయితే కొండల్‌రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌తో పాటు యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరం ఆయనను టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ చైర్మన్‌గా పేర్కొన్నట్లు కేటీఆర్ తెలిపారు.

ఈ వ్యవహారంపై తెలంగాణ గవర్నర్‌కు బీఆర్ఎస్ అధికారికంగా ఫిర్యాదు చేస్తుందని చెప్పారు. అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమన్నారు.

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో సంబంధం ఉ ందని ఆరోపిస్తున్న ఇతర వ్యాపార, భూమి, కాంట్రాక్టు లావాదేవీలపైనా సమగ్ర విచారణ జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే 'జల ఉద్యమం'**

నీటిపారుదల అంశాలపై స్పందించిన కేటీఆర్, తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే ప్రతిపాదన గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశ అజెండాలో కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వం ఆ సమావేశాన్ని బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆ అంశాన్ని అజెండా నుంచి తొలగించకపోతే తెలంగాణ సాగునీటి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా 'జల ఉద్యమం' చేపడుతుందని హెచ్చరించారు.

**తెలంగాణ ఎంపీలపై విమర్శలు**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించే విషయంలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాలను బలంగా వినిపించలేకపోయారని కేటీఆర్ విమర్శించారు. రెండు పార్టీలకు చెందిన ఎంపీల పనితీరును ఉద్దేశిస్తూ "8o8=0" అని వ్యాఖ్యానించారు. నార్లాపూర్, కన్నెపల్లి పంప్‌హౌస్‌లను ప్రభుత్వం వెంటనే ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రార్థనలు, పూజలు చేయడంతోనే సరిపోదని, క్షేత్రస్థాయిలో రైతులకు ఉ పయోగపడే చర్యలు కూడా చేపట్టాలని కేటీఆర్ పేర్కొన్నారు.

## మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఆరోపణలన్నీ నిరాధారమని న్యాయస్థానం తీర్పుతో స్పష్టమైందని చెప్పారు. మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక వర్గం సమన్వయంతో పనిచేసిందని సోనియా ఆరోపించారు. ఆ సమయంలో వచ్చిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవేనని, ఇప్పుడు అవన్నీ అసత్యమని తేలిపోయిందని తెలిపారు. మాజీ ప్రధాని నిర్దోషి అన్న విషయం దేశ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను వినియోగించిందని కూడా సోనియా గాంధీ విమర్శించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థల ద్వారా రాజకీయ ఒత్తిళ్లు తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కొందరిని బెదిరించగా, మరికొందరిని రాజకీయంగా బలహీనపరిచేందుకు చర్యలు చేపట్టారని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై గతంలో చేసిన విమర్శలు, వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సోనియా గాంధీ పేర్కొన్నారు. పార్లమెంట్ చరిత్రలో కొన్ని వ్యాఖ్యలు అత్యంత దిగజారినవిగా నిలిచిపోతాయని వ్యాఖ్యానిస్తూ, మన్మోహన్ సింగ్ ప్రజాసేవకు చేసిన కృషిని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు.

## ఉజ్జయిని మహంకాళికి మారు బోనం

హైదరాబాద్, ఆగస్టు 11

మంత్రి కొండా సురేఖ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో జరిగిన మారు బోనం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి నైవేద్యంగా బోనం సమర్పించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో మారు బోనం కార్యక్రమానికి విశిష్ట స్థానం ఉందని మంత్రి పేర్కొన్నారు. అమ్మవారికి సమర్పించిన బియ్యంతో తిరిగి మారు బోనం చేయడం భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆచారం తెలంగాణ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా బోనమెత్తిన మహిళలను మంత్రి సత్కరించారు. వారికి చీరె, సారె అందజేసి ఆశీర్వదిం చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో నిండిపోయాయి. మంత్రి కొండా సురేఖ, ఉజ్జయిని మహంకాళి అమ్మవారి మారు బోనం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉ ందన్నారు. అమ్మవారి కృపతో తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది ఆషాడ బోనాల ఉ త్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాట్లకు ప్రజల సహకారం తోడవడంతో బోనాల సంబరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని మంత్రి అన్నారు.



శ్వేత
సంపాదకీయం

మంగళవారం 11-8-2026

# ఎవరి కోసం వీరి ఆందోళనలు?

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు.

ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది.

ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్‌సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్‌సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్‌ఎస్‌సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.





# ఇంటింటికీ టీడీపీ.. ప్రజలతో అచ్చెన్నాయుడు

**రాజోలులో గడపగడపకు పర్యటన**

**ప్రజా సమస్యలపై ఆరా**

**సంక్షేమ పథకాలపై వివరణ**

**అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి**

రాజోలు, ఆగస్టు 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రాజోలు నియోజకవర్గంలో నిర్వహించిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు వెల్లడించారు. ప్రజల ఆశీర్వాదమే తమ ప్రభుత్వానికి బలమని పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా పనులతో ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటోందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా పెన్షన్లను పెంచినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

విద్యా రంగంలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టామని, మరోవైపు 6 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్ పథకాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చెన్నాయుడు అన్నారు. అర్చకులకు నెలకు రూ.15 వేలు, ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లు మరియు పాస్టర్లకు రూ.5 వేల గౌరవ వేతనాన్ని అందిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 94 కేంద్ర పథకాలలో 85 పథకాలను పునరుద్ధరించి ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, వ్యవసాయ యంత్రాలను అందిస్తూ సాగును లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సాగునీటి రంగానికి రూ.24 వేల కోట్లకు పైగా కేటాయించి 36 ప్రాజెక్టుల పూర్తికి ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించినట్లు వెల్లడించారు. ఉత్తరాంధ్రలో 11 ప్రాజెక్టుల పనులు వేగవంతం చేస్తున్నామని, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యమని చెప్పారు. అమరావతిని క్వాంటం వ్యాలీగా, విద్యా మరియు వైద్య కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు. 'పల్లె పండుగ' కార్యక్రమం ద్వారా 8 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తూ గుంతలు లేని రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను వివరించడంతో పాటు ఇంకా చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వారి అభిప్రాయాలను తెలుసుకోవడానికే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రాజోలు సహా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.



# పీవోకేలో ఉద్రిక్తత.. బ్రిటిష్ పౌరుడి మృతి

**నిరసనలపై కాల్పులు..**

**మరో బ్రిటిష్ వ్యక్తి అరెస్టు**

**2 నెలలుగా నిర్బంధంలో వకాస్ ఆరిఫ్**

**పాకిస్థాన్ అధికారులతో బ్రిటన్ సంప్రదింపులు**

**ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొద్దని ప్రయాణ హెచ్చరిక**

డెస్క్, ఆగస్టు 11: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో కొనసాగుతున్న నిరసనలు అంతర్జాతీయ స్థాయిలో దుమారం రేపుతున్నాయి. ఆర్థిక, ఎన్నికల సంస్కరణల కోసం నిర్వహించిన ఆందోళనల నేపథ్యంలో పాకిస్థాన్ భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఓ బ్రిటిష్ పౌరుడు ప్రాణాలు కోల్పోగా, మరో బ్రిటిష్ జాతీయుడిని అరెస్టు చేసి రెండు నెలలుగా నిర్బంధంలో ఉంచిన ఘటన వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ అధికారులతో సంప్రదింపులు ప్రారంభించింది. బ్రిటన్‌లోని పీటర్‌బరో నగరానికి చెందిన 50 ఏళ్ల మహ్మద్ అక్తర్ జూన్ 9న కోట్లి నగరంలో జరిగిన నిరసనల సమయంలో భద్రతా బలగాల కాల్పుల్లో మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిరసనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదని, ఇంటి సమీపంలో జరిగిన ఘటనలో తూటా గుండె పక్కన తగలడంతో ప్రాణాలు కోల్పోయారని బంధువులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి కూడా కుటుంబ సభ్యులు భయపడుతున్నారని వారు పేర్కొన్నారు.

మరోవైపు, నాటింగ్‌హామ్‌కు చెందిన 38 ఏళ్ల వకాస్ ఆరిఫ్‌ను జూన్ 5న మిర్పూర్‌లో అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తన సోదరుడు నిరసనల్లో పాల్గొనకపోయినా ఇంట్లోకి చొరబడి అరెస్టు చేశారని, ఇప్పటివరకు కోర్టులో కూడా హాజరుపరచలేదని ఆయన సోదరి సుమేరా ఆరోపించారు. ఈ ఘటన మానవ హక్కుల ఉల్లంఘనలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ రెండు ఘటనలపై బ్రిటన్ విదేశాంగ కార్యాలయం స్పందిస్తూ ఇస్లామాబాద్‌లోని అధికారులతో సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి ఘటనపై పూర్తి నివేదిక కోరడంతో పాటు, నిర్బంధంలో ఉన్న వకాస్ ఆరిఫ్ పరిస్థితిపై వివరాలు తెలుసుకుంటున్నట్లు తెలిపింది. పౌరుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది.

పీవోకేలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో ఆగస్టు 7న బ్రిటన్ ప్రభుత్వం తన ప్రయాణ సూచనలను సవరించింది. నిరసనల ప్రభావం ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని తమ పౌరులను హెచ్చరించింది. భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్నాయని పేర్కొంటూ అత్యవసరమైతే తప్ప ఆ ప్రాంతాలకు ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. పీవోకేలో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు నిరసనకారులపై బలప్రయోగం, మరోవైపు విదేశీ పౌరుల మృతి, అరెస్టుల ఘటనలు పాకిస్థాన్‌పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ వ్యవహారంపై బ్రిటన్ చేపట్టే తదుపరి చర్యలు, పాకిస్థాన్ స్పందనపై ప్రపంచ దేశాల దృష్టి కేంద్రీకృతమైంది.



# సైబర్ మోసాలపై ఉక్కుపాదం

**ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**

**పోలీస్ బలోపేతానికి ప్రాధాన్యం**

**అప్రమత్తతతోనే నేరాలకు చెక్**

అమరావతి, ఆగస్టు 11 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట వేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సైబర్ మోసాల నివారణకు పలు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ అవగాహన కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లడంతో పాటు, సామాజిక మాధ్యమ సంస్థలతో సమన్వయం పెంచి మోసపూరిత కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు ఇతరులకు ఇవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డిజిటల్ ప్రపంచంలో అప్రమత్తతే ప్రధాన రక్షణ కవచమని పేర్కొన్న అనిత, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించి మోసాలకు గురికాకుండా సురక్షితంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, సైబర్ నేరాలపై పోరాటంలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆమె తెలిపారు.

# రైతన్నలు ప్రధానమంత్రి పంట బీమా చేయించుకోవాలి

**ప్రకృతి వైపరీత్యాల్లో రైతన్నలకు ఆసరా**

**ఎలినినో ప్రభావాన్ని ఎదుర్కోవాలి**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

విజయనగరం ఆగస్టు 11,

రైతన్నలు ప్రధానమంత్రి పంట బీమా పథకాన్ని (పీఎంఎఫ్ బివై) నమోదు చేయించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలలో రైతన్నలకు ఈ పథకం ఆసరాగా ఉ ంటుందని ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పథకం (పీఎంఎఫ్ బివై)

నమోదుకు ఆగస్టు 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నదని ఆయన తెలిపారు. బీమా నమోదు చేయించుకోవడానికి పంట సాగు ధ్రువీకరణ పత్రం సరిపోతుందన్నారు. ఈ పంట నమోదు చేయించుకోనప్పటికీ భీమా ముందుగా చేయించుకునే వెసులుబాటు ఉందని, భీమా చేయించుకున్న తర్వాత ఈ పంట నమోదు చేయించుకోవచ్చని రైతన్నలకు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు రైతన్నల ప్రయోజనాల కోసం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారన్నారు. ఈ బీమా పథకం గురించి రైతులు అతి తక్కువ ప్రీమియం చెల్లించాల్సి ఉ ంటుందని, ఖరీఫ్ పంటలకు 2%, రబీ పంటలకు 1.5%, మరియు వాణిజ్య/తోట పంటలకు 5% ప్రీమియం వర్తిస్తుందనీ, మిగిలిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులను ఊహించని నష్టాల నుండి ఆదుకుని, తిరిగి వ్యవసాయం చేసుకునేలా రైతులను ప్రోత్సహించడానికి ఈ పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలయిన వర్షాలు, వరదలు, తెగుళ్ళు, లేదా వ్యాధుల వల్ల పంట నష్టపోయినప్పుడు రైతులకు అండగా ఉ ండేందుకు ప్రధాని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని, తప్పనిసరిగా భీమా తో పాటు ఈ పంట కూడా నమోదు చేయించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

లిఎలినినో ప్రభావాన్ని ఎదుర్కోవాలిలి

అలాగే ప్రస్తుతం ఎలినినో ప్రభావాన్ని రైతులు ధైర్యంగా ఎదుర్కోవాలనీ, నీటి ఆధారిత పంటలు వేసి రైతన్నలు నష్టపోవద్దనీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. వర్షాలు కురవని కారణంగా చెరువులలో నీరు లేదని, ఎలినినో కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయన్నారు. కేవలం బోరు మోటార్లను నమ్ముకుని సాగు చేయడం ద్వారా రైతన్నలు నష్ట పోయే అవకాశం ఉ ందన్నారు. నీటి ఎద్దడి కారణంగా వరి పంట సాగు చేసే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. వాతావరణంలో వచ్చిన సమూల మార్పుల కారణంగా రైతన్నలు ఆరుతడి పంటలు సాగు చేయటం మంచిదన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు సూచనల ప్రకారం, ఎలినినో ప్రభావం కారణంగా సంప్రదాయ వరి సాగుకు దూరంగా ఉ ండి, ఆరుతడి పంటలు మరియు ఆధునిక నీటి యాజమాన్య పద్ధతులు (బిందు సేద్యం) పాటిస్తే రైతులు నష్టాల నుంచి తప్పించుకుని మంచి లాభాలు పొందవచ్చున్నారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలైన వేరుశనగ, కంది, పెసర వంటి పంటలు సాగు చేసి రైతన్నలు లబ్ది పొందాలని రైతన్నలను మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.





## అదనపు బస్సులు లేక పెబ్బేరు బస్టాండ్‌లో జనసంద్రం

పెబ్బేరు, 11 ఆగస్టు: గత మూడు రోజుల వరస సెలవులు ముగియడంతో పెబ్బేరు బస్టాండ్ రణరంగంగా మారింది. ఉద్యోగు లు, విద్యార్థులు,కూలీలు సోమవారం ఉదయం నుంచే స్వస్థలాలకు వెళ్లేందుకు బస్టాండ్ కు పోటెత్తారు.కానీ వచ్చిన ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్లాట్ ఫామ్ ల వద్ద జనసంద్రంగా మారింది. వచ్చిన ప్రతి బస్సు కాలికి సైతం చోటు లేకుండా కిక్కిరిసి వెళ్తోంది. మహిళలు,వృద్ధులు,చిన్న పిల్లలతో వచ్చిన వారు బస్సుల కొరకు గంటల తరబడి వేచి అవస్థలు పడ్డారు.సెలవులు ఉన్నాయని ముందే తెలుసు కదా. అయినా అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



## ఎర్రుపాలెం--నంబూరు రైల్వే లైన్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

**భూ యజమానులకు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి భూసేకరణ అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశాలు**

వీరులపాడు: ఆగస్టు 11, 2026: నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అనుసంధానిస్తూ ప్రతిపాదించిన ఎర్రుపాలెం నంబూరు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకంణ పనులను వేగ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం వద్ద రైల్వే లైన్ ఏర్పాటుకు సంబంధించి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల వివరాలు, సేకరణ ప్రక్రి య పురోగతి, సంబంధిత రికార్డులను పరిశీలించిన ఆయన, భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఎర్రుపాలెం – – నంబూరు రైల్వే లైన్ భూసేకరణకు సంబంధించి ఇప్పటికే భూ యజమానులకు నోటీసులు జారీ చేయడం జరిగిం దని తెలిపారు. నోటిఫికేషన్ ప్రక్రియ అనంతరం భూసేకరణకు సంబంధించిన తదుపరి చర్యలను నిబంధనల ప్రకారం వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపా డు మండలంలోని ఆరు గ్రామాల్లో సుమారు 175 ఎకరాలు, కంచికచర్ల మండలంలోని రెండు గ్రామా ల్లో సుమారు 120 ఎకరాల భూమిని భూసేకరణ ప్రక్రియలోకి తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. భూసేకరణకు సంబంధించిన రికార్డులను సమగ్రం గా పరిశీలించి, భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించా రు. భూసేకరణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా గుంటూరు జిల్లా నంబూరు వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ రైల్వే మార్గం అమరావతితో పాటు పరిసర ప్రాంతాల రవాణా, ఆర్థిక అభివృద్ధికి కీలకంగా నిలిచే అవకాశం ఉందన్నారు.



## ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**అంగన్వాడీ పిల్లలకు బాలామృతాన్ని విధిగా అందించాలి: కలెక్టర్ జి.లక్ష్మీశ**

వీరులపాడు: ఆగస్టు 11, 2026: వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలోని సక్షం అంగన్వాడీ కేంద్రం, ఉర్దూ పాఠశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం, పాఠశాలలో సౌకర్యాలు, పిల్లల ఆరోగ్యం, పోషణ, మౌలిక వసతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోషకాహార లోపం కారణంగా ఎత్తుకు తగిన బరువు లేని పిల్లల వివరాలను అంగన్వాడీ సిబ్బంది నమోదు చేసిన తీరును పరిశీలించారు. పిల్లలను స్వయంగా బరువు తూయించి, యాప్‌లో నమోదైన వివరాలతో క్రాస్ చెక్ చేశారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారి తల్లితో జిల్లా కలెక్టర్ మాట్లాడి, బాలామృతాన్ని ఏ విధంగా వినియోగిస్తున్నారో, పిల్లలకు ఆహారం అందించే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలపై అంగన్వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని, అలాంటి పిల్లల విషయంలో తల్లులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లలకు అందించాల్సిన బాలామృతాన్ని విధిగా అందిస్తూ, వారి ఆరోగ్యం, బరువు పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రస్తుతం బోరు ద్వారా నీటిని వినియోగిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేసి, మోటార్ ద్వారా నీటిని ట్యాంకుకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం ఉర్దూ పాఠశాల ఆవరణను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.



## సర్పంచ్ పార్నంది కేశవ్ ఆధ్వర్యంలో పచ్చునూరులో గ్రామసభ

మానకొండూరు, 11 ఆగస్టు ( డీప్ పల్స్ ) కరీంనగర్ జిల్లా మాన కొండూరు మండలం పచ్చనూరు గ్రామంలో సర్పంచ్ పార్నంది కేశవ్, ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు గ్రామపంచాయతీ సెక్రటరీ జయరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం ఉ ండటంచే నీటి సమస్యలు రావచ్చు అని కావున గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రభుత్వపరంగా 6500 చొప్పున ఇవ్వనున్నట్లు తెలియజేశారు కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో, రానున్న రోజుల్లో నీటి కరువు సంభవించనున్నదని కావున రైతులందరూ, పంట కుంటలను వ్యవసాయ భూముల్లో ఉపాధి హామీ పనిలో బాగంగాపూర్తిగా తవ్వకం ఉంటుంది అని, కావున ఉపాధి హామీ కార్డు ఉండి మూడు ఎకరాలలోపుఉన్న రైతులకు, వివర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు వరి సాగు కాకుండా ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు, ఆయిల్ ఫార్మ్, నూనె గింజలు, కూరగాయలు నువ్వులు పెసర సన్ ఫ్లవర్, సాగు చేయాలని రైతులకు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్నంది కేశవ్ మాట్లాడుతూ, నీటిని వృధా చేయకుండా, ఇంటికి ఒక ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని, వ్యవసాయ అధికారులు చెప్పిన విధంగా పంట కుంటలు, ఇంటికో ఇంకుడు గుంత నిర్మించుకొని, నీటి కరువు బారి నుండి మనకు మనం రక్షించుకోవాలని ఈ సందర్భంగా పార్నందుకేశవ తెలియజేశారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, కంది,పవిత్ర కూరాకుల లక్ష్మి, నెలవేని సుశీల, పిట్టల సువర్ణ, పూసల సతీష్ కలువల రవి పిట్టల మల్లేశం, ఏ ఈ ఓ సతీష్, రెవెన్యూ సిబ్బంది, మరియు వ్యవసాయ అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గ్రామ సభ

కంది, 11 ఆగష్టు : సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎర్ధనూర్ గ్రామంలో సర్పంచ్ పంబాల జ్యోతి దుర్గా ప్రసాద్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు . ఈ సమావేశంలో పలు గ్రామ సమస్యలలు ప్రజలు సర్పంచ్ దృష్టికి తేవడంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ సమావేశంలో వ్యవసాయ మండల అధికారులు ఏఒ ఆసియా బబేగం, ఏఈ సునీల్ గారు పాల్గొని గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని, అధిక దిగుబడులు వచ్చే పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని, ఏలినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలో వైపు ముగ్గు చూపాలని సూచించడం జరిగింది.




# స్వాతంత్ర వేడుకలను రాష్ట్రస్థాయి వేడుకలతో సమాంతరంగా నిర్వహిద్దాం

**ఆగస్టు 15న ఎన్టీఆర్ జిల్లా పతాకావిష్కరణలో పాల్గొననున్న విద్యాశాఖల మంత్రి నారా లోకేష్**

**రైన్‌ప్రూఫ్ టెంట్లు, తాగునీరు, వైద్య శిబిరం, విద్యుత్ తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలిలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

విజయవాడ: ఆగస్టు 11, 2026. ఎన్టీఆర్ జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాష్ట్రస్థాయి వేడుకలకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వేడుకలకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సమన్వయంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం ధ్యాన్ చంద్రతో కలిసి స్టేడియంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, విజయవాడ కేంద్రంగా ఉన్న మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రానున్న నెలల్లో ఇదే వేదికగా మరో రెండు భారీ కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్ణయించినందున, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్టేడియంలో పటిష్టమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నందున వేడుకలకు హాజరయ్యే వీఐపీలు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైన్‌ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేసి వర్షం కారణంగా కార్యక్రమానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. తాగునీటి వసతి,



సిట్టింగ్ అరేంజ్‌మెంట్స్, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, వాటిని కార్యక్రమానికి ముందు మరోసారి పరిశీలించాలని సూచించారు. వేడుకల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యగా అదనపు జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. స్టేడియంలో విద్యుత్ సంబంధిత అన్ని సదుపాయాలను ముందుగానే తనిఖీ చేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వేడుకలకు సుమారు 4 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున పోలీసు శాఖ సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదనంగా ప్రజలు వేడుకలను వీక్షించేందుకు వచ్చినప్పటికీ ఎలాంటి ఒత్తిడి, ఇబ్బంది కలగకుండా రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా స్టేడియం పరిసర ప్రాంతాల్లో అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అవసరమైన మేరకు భారీ కేడింగ్ ఏర్పాటు చేసి, ప్రేక్షకులు, ఆహ్వానితులు, వీఐపీలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని సూచించారు.







# సేంద్రియ వ్యవసాయంతో భూసారం పెంపొందించాలి

**అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం**

**ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి**

**రైతులకు కేటాయించిన కోటా మేరకు ఎరువులు అందుబాటులో ఉంటాయి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**... జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

వీరులపాడు: ఆగస్టు 11, 2026: వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో సేంద్రియ వ్యవసాయ క్షేత్రం, బయో రిసోర్స్ సెంటర్, పిఎసిఎస్‌లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. పొన్నవరం గ్రామంలోని రైతు సేంద్రియ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన "రైతన్న నీకోసం -- ఎల్‌నినో ప్రభావ నివారణకు కార్యాచరణ ప్రణాళిక" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఏర్పడుతున్న ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. ఉద్యానవన పంటల సాగులో అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. పంటల వైవిధ్యంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా చీడపీడల నుంచి పంటలను రక్షించడంతో పాటు భూసారాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణం, జీవకోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి రైతుకు వివరించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం శ్రీ గౌరీ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న సేంద్రియ ఉత్పత్తులను పరిశీలించి, వాటి తయారీ విధానం, రైతులు వాటిని ఏ విధంగా వినియోగిస్తున్నారు, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం పొన్నవరం పిఎసిఎస్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు ఎరువుల సరఫరా ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రైతుల పంట విస్తీర్ణం ఆధారంగా ఎరువులు కేటాయించడం జరుగుతుందని, కేటాయించిన కోటా మేరకు అవసరమైన సమయంలో ఎరువులను తీసుకెళ్లవచ్చని కలెక్టర్ తెలిపారు. ఒక్కో రైతుకు కేటాయించిన కోటా ఆ రైతుకే ఉంటుందని, ఎరువుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడటం, ఎరువులు అయిపోతాయేమోనని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు పొందే సులభమైన మార్గం అందుబాటులో ఉందన్నారు. రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పిఎసిఎస్ ఆవరణలో రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, తహసీల్దార్ పాలపర్తి రవికుమార్, ఎంపీడీవో శేఖర్, మండల వ్యవసాయ అధికారి జోగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మంథని మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

మంథని, 11 ఆగస్టు(డీప్ పల్స్): మంథని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.ఎన్. జయ ప్రకాశ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జయ ప్రకాశ్‌పై వచ్చిన పలు ఆర్థిక ఆరోపణల నేపథ్యంలో ప్రాథమిక విచారణ చేపట్టిన అనంతరం ఈ చర్య తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 7న మంథని మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు జయ ప్రకాశ్‌పై పలు ఆర్థిక ఆరోపణలు చేసినట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి ప్రాథమిక విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, విధుల పట్ల అంకితభావం లోపించడం, ప్రభుత్వ ఉద్యోగికి తగని ప్రవర్తన వంటి అంశాలు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (ప్రవర్తనా) నిబంధనలు, 1964లోని రూల్ 3(1), 3(2) నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని రూల్ 20 ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు సిసిఏ రూల్స్, 1991లోని రూల్ 8(1) ప్రకారం జయ ప్రకాశ్‌ను తక్షణమే సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. సస్పెన్షన్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

## దశాబ్దాల మురుగు సమస్యకు చెక్

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



పెబ్బేరు, 12 ఆగస్టు: ఆధునిక సివరేజ్ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.9.20 కోట్ల నిధులు మంజూరు చేయడంపై మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాలుగా పెబ్బేరు ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం దొరికిందని, ఇదంతా సీఎం,ఎమ్మెల్యే చిత్తశుద్ధి వల్లే సాధ్యమైందన్నారు.పెబ్బేరు అభివృద్ధే మా లక్ష్యం. ప్రజా సంక్షేమే మా ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ పునరుద్ఘాటించారు.




## యాదాద్రి జిల్లాలో నెలవారీ నేర సమీక్ష

**ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ కీలక ఆదేశాలు**

యాదాద్రి భువనగిరి, 11 ఆగష్టు : యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ గారి ఆధ్వర్యంలో భువనగిరి డి ఏ ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మరియు ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలోని వివిధ నేరాలకు సంబంధించిన కేసులపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించి, కేసుల దర్యాప్తు మరియు సత్వర పరిష్కారానికి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ వారీగా పోక్సో కేసులను సమీక్షించారు. ముఖ్యంగా పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సకాలంలో దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో నమోదైన ఎన్ డి పి ఎస్ కేసుల పురోగతిని సమీక్షించి, సమర్థవంతమైన దర్యాప్తుతో కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సి /ఎస్టి కేసులను సమీక్షించి, దర్యాప్తును వేగవంతం చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. చాలా కాలంగా పెండింగ్ కేసులను గుర్తించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలకు సంబంధించిన డిస్పోజల్ కేసులను సమీక్షించి, నిబంధనల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే పిటిషనర్లను ఎస్‌ఎచ్‌ఓ లు తప్పనిసరిగా వ్యక్తిగతంగా కలుసుకుని, వారి సమస్యలను తెలుసుకుని, ప్రతి పిటిషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు కఠినంగా ఆదేశించారు. రాబోయే పండుగల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసులు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ, నేరాల నియంత్రణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, కేసుల సత్వర దర్యాప్తు మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ గారు సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్ గారు స్పష్టం చేశారు.



## డ్రగ్స్ రహిత అశ్వారావుపేటకు విద్యార్థులే భాగస్వాములు-ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, 11 ఆగస్టు (డిప్ పల్స్): దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా నేను సైతం చేయూత విద్యా అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విద్యాయాత్ర మన ఎమ్మెల్యే మన బడి అనే నూతన కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు.పాఠశాలలో పోలీస్ మరియు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేకవారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, డ్రగ్స్ రహిత అశ్వారావుపేట నిర్మాణానికి ప్రతీ విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చీకటిమయం అవుతుందని హెచ్చరిస్తూ, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలు, చదువు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి పెట్టాలనిసూచించారు.అనంతరం ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానాన్ని, విద్యా ప్రమాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే తరగతి గదులు, హాస్టల్, తాగునీరు మరియు ఇతర మౌలిక వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన విద్య, సౌకర్యాలు అందేలా చూడాలని అధికారులకు, ఉపాధ్యాయులకు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆత్మీయంగా టిఫిన్ చేస్తూ వారి సమస్యలు, చదువు విశేషాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇదప్ప, దమ్మపేట మండల ట్రైనింగ్ కలెక్టర్ ఎం మురళి, ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంఈఓ జగపతి రావు, సిఐ నాగరాజు, ఎస్ఐ రాజేష్, మాజీ సర్పంచ్ మడకం రాజేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాక రమేష్, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## చట్టం మారింది.. కుబీర్ ఉపాధి బోర్డు ఎప్పుడు మారుతుంది?

**పాత బోర్డుతోనే కొనసాగుతున్న కార్యాలయం..**

కుబీర్, 11 ఆగస్టు(డీప్ పల్స్): కుబీర్ మండల కేంద్రంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయ బోర్డును నూతన చట్టం ప్రకారం మార్చాలని స్థానికులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పాత ఎంజిఎన్ఆర్ఈజీఏ స్థానంలో (వీబీ జీ రామ్ జీ) చట్టాన్ని దేశవ్యాప్తంగా అధికారికంగా అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ నూతన చట్టం ద్వారా గ్రామీణ కూలీలకు పని దినాలను 100 రోజుల నుండి 125 రోజులకు పెంచడం జరిగింది. అయితే ప్రస్తుతం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఇంకా పాత పేరే కొనసాగుతుండటంతో నిరక్షరాస్యులైన కూలీలు నూతన మార్పులను తెలుసుకోలేక గందరగోళానికి గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కార్యాలయానికి నూతన చట్టం పేరుతో బోర్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే 125 రోజుల ఉపాధి కల్పనతో పాటు మారిన ఇతర నిబంధనలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


# 30 టీఎంసీల నీటిని వెంటనే ఎత్తిపోయండి

## సిద్దిపేట కలెక్టర్‌కు హరీశ్‌రావు లేఖ

సిద్దిపేట, ఆగస్టు 11 (ఈవార్తలు): సాగు నీటి కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని.. సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు 30 టీఎంసీల నీటిని వెంటనే ఎత్తిపోయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ల దుస్థితి చూస్తే దుఃఖం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన సిద్దిపేట కలెక్టర్, ఇరిగేషన్ అడ్వైజరి కమిటీకి లేఖ రాశారు. జిల్లాలో వచ్చే ఏడాది జూలై నాటికి సాగు, తాగు నీటి కొరత లేకుండా చూడాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సిద్దిపేట జిల్లాలో వచ్చే వానాకాలం వరకు జిల్లా రైతులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మళ్లీ వేసవిలో నీటిని ఎత్తిపోయడానికి మిడ్ మానేరులో సరిపడా నీళ్లను నిల్వ చేసేలా చర్యలు చేపట్టాలి. మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశం సందర్భంగా పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లిందుకు లేఖ రాశాను. ఎల్‌నినో ప్రభావంతో జిల్లా స్థాయిలో ఇరిగేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో కొన్ని అంశాలు ప్రస్తావిస్తున్నాను. ఈ అంశాలపై తక్షణమే చర్యలు చేపడితే వచ్చే వానాకాలం వరకు ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించొచ్చు అని ఆ లేఖలో తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మించుకున్నాం.



ఏటా ఈ సమయం వరకే రిజర్వాయర్లలోకి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు రిజర్వాయర్ నుండి నీటిని ఎత్తిపోయడం జరిగేది. కానీ ఈసారి ఇంకా ఎత్తిపోతలు ప్రారంభించలేదు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. వీటిని వెంటనే నింపాల్సి ఉంది. అదే విధంగా



కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు అడుగంటే పరిస్థితిలో ఉన్నాయి అని మాజీ మంత్రి ఆవేదన చెందారు. ఈ రిజర్వాయర్లలోకి తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు నింపాలి. దీనివల్ల భూగర్భ జలాలు పెరిగి ఈ వానాకాలం పంటల సీజన్లో జిల్లాలోని రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారు. మిగతా వారు సాగునీళ్లు లేవనే ఉద్దేశంతో మంచి భూములను బీడుగా ఉంచారు. ప్రస్తుతం సాగవుతున్న పంటలు గట్టెక్కాలన్నా ఈ రిజర్వాయర్లను నింపడమే శరణ్యం అని లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. 2027, జూలై నెల వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నది. అప్పటివరకు సాగునీరు, తాగునీటికి కొరత రాకుండా ఉండాలంటే ఇప్పటికిప్పుడు రిజర్వాయర్లలోకి ఎత్తిపోతలు ప్రారంభించాలి. ఈ నీళ్ల వినియోగం పూర్తయితే మళ్లీ ఎత్తి పోయడానికి మిడ్ మానేరు రిజర్వాయర్‌లో జిల్లాకు సరిపడా నీటిని స్టోరేజీ చేసి ఉంచాలి. యాసంగి పంట కాలం సమయంలో అవసరానికి లిఫ్ట్ చేసుకొనే విధంగా నీటిపారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి అని ఆయన అన్నారు. సుమారు 6 నుండి 7 టీఎంసీల నీళ్లు తాగునీటి అవసరాలకే వినియోగించాల్సి ఉంటుంది. వరి, పామాయిల్, ఇతర పంటలు సాగుచేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసమే ఎదురుచూస్తున్నారు. రిజర్వాయర్ల దుస్థితి చూస్తే మాత్రం దుఃఖం వస్తోంది. గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడే వడివడిగా నీటిని ఎత్తిపోస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు.

## 'కంటి వెలుగు' బాధితులకు 5 లక్షలు

**మానవ హక్కుల కమిషన్ కీలక ఆదేశాలు**

హనుమకొండ/హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): 2018లో హనుమకొండలోని జయా ఆస్పత్రిలో 'కంటి వెలుగు' ఆపరేషన్లు వికటించి 18 మంది తమ చూపు కోల్పోయారు. ఈ ఘటనపై సుమోటోగా విచారణ జరిపిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తాజాగా బాధిత కుటుంబాలకు పరిహారం ప్రకటించింది. ప్రస్తుతం జీవించి ఉన్న 12 మందికి రూ.4 లక్షల చొప్పున, మరణించిన 6 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఆస్పత్రిలో స్టెరిలైజేషన్, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని కమిషన్ నిర్ధారించింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్.. ఆరోగ్య శాఖ నివేదికలు, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి డాక్టర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించింది. జయా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, స్టెరిలైజేషన్ తదితర విషయాల్లో ఘోరమైన వైఫల్యం ఉన్నట్లు తేల్చింది. ఆపరేషన్ సమయంలో వాడిన పరికరాలు శుభ్రంగా లేకపోవడం వల్లే రోగుల కళ్లలో 'ఎంటెరోబాక్టర్ క్లోకే' అనే ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్ వ్యాపించిందని కమిషన్ నిర్ధారించింది. దీని వల్ల 18 మంది అమాయకులు తమ కంటి చూపును కోల్పోయి తీవ్ర శారీరక, మానసిక క్షోభకు గురయ్యారు. ఇది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమేనని కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## పింగళి వెంకయ్యకు భారతరత్నే అసలైన గౌరవం: వీహెచ్

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన మహనీయుడు పింగళి వెంకయ్యకు అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిలిచిన త్రివర్ణ పతాకాన్ని అందించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడికి భారత ప్రభుత్వం ఇవ్వగల ఏకైక సముచితమైన నివాళి భారతరత్న మాత్రమేనంటూ ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' పిలుపును స్వాగతిస్తూనే... జాతీయ జెండా రూపకర్త విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యాన్ని వీహెచ్ ఎండగట్టారు. దేశమంతటా త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడుతున్నప్పుడు, దానికి ప్రాణం పోసిన తెలుగు నేల ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య సేవలను ప్రధాని మోదీ ఎందుకు విస్మరిస్తున్నారో అర్థం కావడం లేదని ఘాటుగా ప్రశ్నించారు.

## సీఎం సోదరులు.. షెల్ దొంగలు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు**

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు):ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే

## ఏడాదిన్నర పాటు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 11 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ నెల 18 నుంచి కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వే అమలు చేయనున్నట్లు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ వన్ వే కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు. సుమారు ఏడాదిన్నర పాటు ఈ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. గతంలో నిర్వహించిన రెండు ట్రయల్ రన్‌ల సందర్భంగా సహకరించినట్టే.. 18 నుంచి కూడా సహకరించాలన్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే రోడ్డుకు వన్ వే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వన్ వే



అమలులో ఉంటుందని చేశారు. ఎన్ఎఫ్‌సీఎల్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళ్లే వాహనదారులను పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు ఈ వన్ వేను అమలు చేయాలని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

# రేవంత్‌కు ఒకలా.. తమిళనాడుకు మరోలా?

## డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ వైఖరి సరికాదు.. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఫైర్

చెన్నై: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై జాతీయ స్థాయిలో రాజకీయ దుమారం రేగుతోంది. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని డీఎంకే సీనియర్ నేత, ఎంపీ దయానిధి మారన్ తీవ్రంగా ఖండించారు. తమిళనాడులో డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ ఎంపీలతో మీటింగ్‌లు పెడుతున్న కాంగ్రెస్.. తెలంగాణలో తమ సొంత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా దీనికి మద్దతు తెలుపుతున్నా ఎందుకు సైలెంట్‌గా ఉందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకవైపు తమిళనాడులో ఎంపీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పెద్ద పొలిటికల్ హైడ్రామా క్రియేట్ చేస్తోందని దయానిధి మారన్ మండిపడ్డారు. "నిజంగా కాంగ్రెస్ స్టాండ్ అదే అయితే, ఆ పార్టీ అధికారంలో ఉన్న మిగతా నాలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఎంపీల సమావేశాలు ఎందుకు నిర్వహించలేదు?" అని ఆయన నిలదీశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే ఈ మార్పులపై కాంగ్రెస్ వైఖరి ఏంటో దేశ ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని మారన్ గుర్తుచేశారు. డీలిమిటేషన్ వల్ల తెలంగాణలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు భారీగా పెరుగుతాయని, రాష్ట్రానికి మేలు జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. "మరి బీజేపీ సర్కార్ చేస్తున్న ఈ డీలిమిటేషన్ ప్రక్రియకు రేవంత్ రెడ్డి ఎలా మద్దతు ఇస్తారు? ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్టానం ఎందుకు తప్పుబట్టడం లేదు? ఆయన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు?" అని మారన్ ఫైర్ అయ్యారు.

# 23 నుంచి తిరుమలలో పవిత్రోత్సవాలు

తిరుమల, ఆగస్టు 11 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు ముఖ్య గమనిక. తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్ట్ 23వ తేదీ నుంచి ఆగస్ట్ 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పలు ఆర్జిత సేవలను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. ఆగస్ట్ 22వ తేదీ నిర్వహించే అంకురార్పణ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయి. తిరుమ ల శ్రీవారి ఆలయంలో సంవత్సరం పొడువునా అర్చనలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో భక్తులు, సిబ్బంది వలన తెలియకుండా జరిగే దోషాల నివారణ కోసం, ఈ దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం కలగకుండా ఉండేందుకు, ఆగమ శాస్త్రం ప్రకారం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే ఆగస్ట్ 23 నుంచి 25వ తేదీ వరకూ మూడు రోజుల పాటు తిరుమలలో



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మూడు రోజులు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుంది. అలాగే మూడు రోజులు సాయంత్రం వేళ ప్రత్యేక అలంకరణతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ మాడవీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 23వ తేదీన పవిత్రాల ప్రతిష్ట కార్యక్రమం ఉంటుంది. ఆగస్ట్ 24న పవిత్ర సమర్పణ, 25న పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించను న్నారు. పవిత్రోత్సవాల నేపథ్యంలో టీటీడీ పలు ఆర్జిత సేవలు రద్దు చేసింది. పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేసే ఆగస్ట్ 22వ తేదీ సహస్రదీపాలంకార సేవను రద్దు చేశారు. ఆగస్ట్ 23వ తేదీ నుంచి ఆగస్ట్ 25వ తేదీ వరకూ ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, కళ్యాణోత్సవం, సహస్రదీపాలం కార సేవను రద్దు చేశారు.

## డీఎస్సీపై సీబీఐ విచారణ జరగాల్సిందే: రోజా



పుత్తూరు: కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## ఏపీలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్

వైజాగ్, ఆగస్టు 11 (ఈవార్తలు): ఏపీలోని పలు జిల్లాలలో మరికొన్ని గంటలలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు గంటలు పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలలో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసింది. నర్సీపట్నం, ఎలమంచిలి, తాళ్లపాలెం పరిసర ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉందని తెలిపింది. తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, సురక్షిత ప్రాంతాలలో ఉండాలని ప్రజలను అప్రమత్తం చేసింది. మరోవైపు ఉపరితల ఆవర్తన ప్రభావంతో.. బుధవారం నాటికల్లా వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం జిల్లాలలో అక్కడక్కడా పిడుగులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అంబేద్కర్ కోనసీమ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఉరుములు, ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు చెట్ల కింద ఉండొద్దని, భారీ హోర్డింగ్స్ వద్ద గానీ నిలబడకూడదని సూచించింది.







# ఫుట్‌బాల్‌కు మెస్సీ బ్రేక్!

ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిసిన మెస్సీ లియోనల్ మెస్సీ తన తండ్రి జార్జ్ మెస్సీ మరణంతో విషాదంలో కూరుకుపోయాడు. తాను ప్రపంచం గర్వించదగ్గ ఫుట్‌బాలర్ అవ్వడానికి కారణమైన తండ్రి ఇక లేరనే వార్తను జీర్ణించుకోలేకపోతున్న మెస్సీ.. కొన్నిరోజులు ఆటకు విరామం ప్రకటించాడు. అయితే.. అతడు మళ్లీ పునరాగమనం ఎప్పుడు చేస్తాడు? అనేది తెలియాల్సి ఉంది. ఫిఫా వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి నుంచి తేరుకోకముందే తండ్రి జార్జ్ మెస్సీ మరణంతో కుంగిపోయాడు లియోనల్ మెస్సీ. గుండెపోటుతో జార్జ్ 68 ఏళ్లకే కన్నుమూయడం సాకర్ దిగ్గజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. తండ్రి అంత్యక్రియల కోసం అర్జెంటీనా చేరుకున్న మెస్సీ.. తండ్రి జ్ఞాపకార్థం నిర్వహించే తదనంతర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. దాంతో, కొన్ని రోజులు ఆటపై దృష్టి పెట్టే పరిస్థితి లేకపోవడంతో మెస్సీ విరామం ప్రకటించాడు. కొన్ని రోజులు మెస్సీ మైదానంలో దిగడు అని స్పానిష్ వార్తపత్రిక మర్కా వెల్లడించింది. తండ్రి మరణవార్త తెలియగానే తమ సొంత పట్టణం రొసారియాకు ప్రైవేట్ విమానంలో వెళ్లాడు మెస్సీ. ఈ వారంలో జార్జ్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దాంతో.. ఇంటర్ మియామి క్లబ్ యాజమాన్యం మెస్సీకి కావాల్సినన్ని రోజులు సెలవులు మంజూరు చేసింది. అతడు తిరిగి స్క్వాడ్‌లో చేరాలనుకునేంత వరకూ అర్జెంటీనాలోనే ఉండేందుకు అనుమతిచ్చింది ఇంటర్ మియామి.

## ప్రజ్ఞానంద తొలి గేమ్ డ్రా



సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా అమెరికాలో జరుగుతున్న సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద తొలి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఫస్ట్ రౌండ్‌లో నల్లపావులతో ఆడుతూ అమెరికా జీఎం సామ్ సేవియన్‌తో తలపడ్డ ప్రజ్ఞా.. 48 ఎత్తుల తర్వాత గేమ్‌ను డ్రాగా ముగించాడు. అమెరికా ఆటగాడు ఫాబియానో కరువానా.. జోర్డాన్ వాన్ (నెదర్లాండ్స్)ను ఓడించడం మినహా మిగిలిన ప్లేయర్లంతా తొలి గేమ్‌ను డ్రాతోనే సరిపెట్టుకున్నారు.

## సూపర్ శ్రేయాషి జోషి

సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషుయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీ చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించారు. ఈ టోర్నీలో భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి బ్రాంజ్ మెడల్‌ను గెలుచుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో గోల్డ్ మెడల్‌ను సాధించి రీజియన్‌లో పేరు తెచ్చుకున్న శ్రేయాషి అంతర్జాతీయంగా కూడా సత్తా చాటింది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషి మూడేండ్ల వయసు నుంచే సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ఆడటం ప్రారంభించింది. ఆరేండ్ల వయసు వచ్చేసరికి జాతీయ క్రీడాకారిణి ఎదిగింది. 59వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ చాంపియన్‌షిప్స్ 2021లో మొహాలిలో నిర్వహించారు. అదేవిధంగా 2024, బెంగళూరులో నిర్వహించిన 62వ నేషనల్ చాంపియషిప్స్‌లో కూడా స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింట్లోనూ గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో రెండు విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారతీయ స్కేటర్లలో జినేష్ నానల్‌తో పాటు శ్రేయాషి ఒకరు.

## అభిషేక్ పోరెల్ అరెస్ట్

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్న బెంగాల్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్ అయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, బెదిరింపులకు గురిచేశాడని ఓ మెడికల్ విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. కలకత్తా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. హూగ్లీ రూరల్ ఎస్పీ కున్వర్ భూషణ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. డమ్ డమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామీ సిటీలో అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఓ మెడికల్ విద్యార్థిని అభిషేక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత మూడేళ్లుగా తాము రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, గత ఏడాది నుంచి అభిషేక్ తనను దూరం పెడుతున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చి పలుమార్లు లైంగిక సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని బాధితురాలు ఆరోపించింది.




# రివర్స్ సింగ్‌పై ఫోకస్

**శ్రీలంక పేసర్లను ఎదుర్కొనేలా గిల్ ప్లాన్**



**కొలంబోలో 6 రోజుల పాటు టీమిండియా ప్రాక్టీస్**

శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు భారత్ మునుపెన్నడూ లేని రీతిలో సిద్ధమవుతోంది. ఈ నెల 4న కొలంబో చేరిన గిల్‌సేన.. నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఆరు రోజులపాటు విరామం లేకుండా సాధన చేసింది. మూడు రోజుల వామప్ మ్యాచ్‌తో పాటు మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటలపాటు కఠోర నెట్ సెషన్లు నిర్వహించారు.

**లంకపై 18 ఏళ్లుగా కొనసాగుతున్న టెస్టు సిరీస్ ఓటమి లేని రికార్డును నిలబెట్టుకోవడంతో పాటు, ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం ఉండటంతో జట్టు యాజమాన్యం తీవ్రంగా సిద్ధమవుతోంది.**

## రోజుకు ఐదారు గంటల కఠోర నెట్ సెషన్లు.. పగుళ్ల పిచ్‌పై భారత స్పిన్నర్ల సాధన

ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే శ్రీలంకలో టెస్టులు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లకు అక్కడి పరిస్థితులు కొత్త. దీంతో కొలంబో చేరిన 24 గంటల్లోనే సాధన ప్రారంభించిన జట్టు.. వేడి, తేమతో కూడిన వాతావరణానికి అలవాటు పడేలా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రాక్టీస్‌ను రెండు విడతలుగా నిర్వహించాడు. వామప్ మ్యాచ్ సందర్భంగా ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, మరోవైపు నెట్స్‌లోనూ సాధన కొనసాగించారు. ఈ క్రమంలో ఫాస్ట్ బౌలర్లు పూర్తి వేగంతో బౌలింగ్ చేశారు. పంజాబ్ పేసర్ గుర్నూర్ బ్రార్ వేసిన బంతి కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కుడిచేతి వేలికి బలంగా తాకింది. ముందు జాగ్రత్తగా రెండు రోజుల వామప్ మ్యాచ్‌కు దూరంగా ఉన్న గిల్ చివరి రోజు ఓపెనర్‌గా బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్‌తో తన ఫిట్‌నెస్‌ను చాటాడు.

**పగుళ్ల పిచ్‌పై స్పిన్ సాధన**

వామప్ మ్యాచ్ అనంతరం విశ్రాంతి ఉంటుందని భావించినా ప్రధాన పేసర్లను మినహాయించి మిగతా ఆటగాళ్లు మళ్లీ మూడు గంటలకు పైగా సాధన చేశారు. టెస్టు నాలుగో రోజు పిచ్‌ను పోలిన విధంగా పగుళ్లతో కూడిన వికెట్‌ను ప్రత్యేకంగా సిద్ధం చేసి స్పిన్నర్లను ఎదుర్కొన్నారు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మానవ్ సుతార్, సారాంశ్ జైన్ బౌలింగ్‌లో బ్యాటర్లు డిఫెన్స్, ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లను సాధన చేశాడు. గత పర్యటనల్లో పరిస్థితులకు త్వరగా అలవాటు పడకపోవడం వల్ల ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా జట్టు ముందస్తు ప్రణాళికతో సాగుతోంది.

**రివర్స్ స్వింగ్‌పై గిల్ ఫోకస్**

శ్రీలంక పిచ్‌లపై ఎదురయ్యే రివర్స్ స్వింగ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు గిల్ ప్రత్యేక సాధన చేశాడు.



# గంగూలీ దంపతులకు హత్య బెదిరింపులు

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీకి తీవ్రమైన బెదిరింపులు ఎదురయ్యాయి. తనను, తన భార్య డోనా గంగూలీని చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు హెచ్చరిక లేఖలు పంపారని, దీనిపై దాదా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన క్రీడా వర్గాల్లో, కోల్‌కతాలో తీవ్ర కలకలం రేపింది. సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. గత ఆరు నెలలుగా గంగూలీ పేరు మీద ఈ బెదిరింపు లేఖలు వస్తున్నాయి. అయితే, వాటిని తొలుత అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, నిన్న తన కార్యాలయానికి అందిన రెండు లేఖల్లో "నిన్ను, నీ భార్యను చంపేస్తాం. నీకు సన్నిహితంగా ఉండేవారికి హాని తలపెడతాం" అని స్పష్టంగా ఉండటంతో గంగూలీ అప్రమత్తమయ్యాడు. వెంటనే తన మేనేజర్ ద్వారా కోల్‌కతాలోని ఠాకూర్‌పుకుర్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయించాడు. గంగూలీ ఫిర్యాదును తీవ్రంగా పరిగణిస్తున్నామని, వెంటనే దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు. ఈ లేఖల మూలాలను, వాటిని పంపిన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. లేఖల కంటెంట్‌తో పాటు వాటిని పంపిన విధానంపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు ఓ అధికారి వివరించారు. ఈ లేఖలన్నీ ఒకే వ్యక్తి పంపాడా? లేక దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రాథమిక విచారణలో కీలక సమాచారం లభించినట్టు తెలుస్తోంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బెల్ఘరియా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొరియర్ సర్వీస్ ద్వారా ఈ లేఖలను పంపి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు వాడినట్లుగా భావిస్తున్న సిమ్ కార్డు కదలికలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



# 2027 ప్రపంచకప్‌కు ఆఫ్ఘనిస్థాన్ అర్హత

**రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ షో**


ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు 2027 వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన రెండో వన్డేలో 3 వికెట్ల తేడాతో విజయం సాధించి ఈ ఘనతను అందుకుంది. కెప్టెన్ రషీద్ ఖాన్ బంతితో, బ్యాట్‌తో అద్భుతంగా రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆఫ్ఘనిస్థాన్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దక్షిణాఫ్రికా దేశాల్లో జరిగే ప్రపంచకప్ టోర్నమెంట్‌లో వరుసగా నాలుగోసారి తమ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 47 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 128 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, తొమ్మిదో వికెట్‌కు గేవిన్ హోయ్ (36), జై మూంద్రా (31) రికార్డు స్థాయిలో 76 పరుగులు జోడించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించారు.





## 'జై హనుమాన్'లో వామిక గబ్బి!

టాలీవుడ్ నుంచి రానున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'జై హనుమాన్' ఒకటి. బ్లాక్‌బస్టర్ 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడిగా నటిస్తుండగా, యంగ్ హీరో తేజ సజ్జ కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. భారీ గ్యాప్ తర్వాత ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పౌరాణిక సూపర్‌హీరో చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే, ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ క్రేజీ బజ్ వైరల్ అవుతోంది. ఇటీవలి కాలంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ట్రెండింగ్ బ్యూటీ వామికా గబ్బి 'జై హనుమాన్' చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే కోలీవుడ్ హిట్ చిత్రం 'డిసి' లో తన అద్భుతమైన నటనతో మంచి మార్కులు కొట్టేసిన వామికా.. ఇప్పుడు ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కానుందనే వార్త అభిమానులను ఎంతగానో ఉత్సాహపరుస్తోంది. విభిన్న నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న వామికా గబ్బి ఈ చిత్రంలో ఒక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనుందని సమాచారం. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## ఆయనో నక్క.. నేను విశ్వాసమున్న కుక్కను

బాలీవుడ్ నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్, ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ దేశంలో తింటూ, పొరుగు దేశం కోసం పోరాడతారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల నిరసనలపై బాలీవుడ్ ప్రముఖుల మౌనం గురించి గతంలో నసీరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వివాదం మరోసారి రాజుకుంది. ఇటీవల నటుడు పియూష్ మిశ్రా, నసీరుద్దీన్ షా వ్యాఖ్యలను ప్రస్తావించిన ఓ వార్తను కంగనా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్‌ను ఉద్దేశిస్తూ.. "నిజం చెప్పాలంటే ప్రతి ఒక్కరూ ఎవరో ఒకరికి కుక్కలే. కానీ, నేను ఏ ఇంటి (దేశం) రొట్టె తింటున్నానో, ఆ ఇంటికి కాపలా కాస్తున్నందుకు, దాని కోసం పోరాడుతున్నందుకు గర్వపడుతున్నాను. నసీర్ సాబ్ ఈ దేశపు తిండి తింటారు. కానీ, పొరుగు దేశం కోసం పోరాడతారు" అని కంగనా రాసుకొచ్చారు.

## టాక్సిక్.. 3:11 గంటల రన్‌టైం

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కేజీఎఫ్ సిరీస్ తర్వాత యశ్ నుండి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి 3 గంటల 11 నిమిషాల భారీ రన్‌టైమ్ ఉండబోతున్నట్లు సమాచారం. సినిమా కథాంశం, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు ఎమోషనల్ డ్రామాకు తగినట్లుగా నిడివి కాస్త ఎక్కువగా ఉండొచ్చని, దాదాపు మూడు గంటల పాటు సినిమాను నడిపించేలా దర్శకురాలు ప్లాన్ చేస్తున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## రాహుల్ సిప్లిగంజ్‌పై కేసు

ప్రముఖ గాయకుడు, బిగ్‌బాస్ విజేత రాహుల్ సిప్లిగంజ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన ఆయనపై విశాఖపట్నంలో కేసు నమోదైంది. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖకు చెందిన ఓ యువతి ఫిర్యాదు ప్రకారం.. కర్పూరపు రాహుల్ రెడ్డి అనే వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్ కూడా జోక్యం చేసుకున్నారని యువతి ఆరోపించారు. రాహుల్ రెడ్డికి బంధువునని చెప్పి, తనను బెదిరించారని, బలవంతంగా కొన్ని వీడియో స్టేట్‌మెంట్లు ఇప్పించారని ఆమె తన ఫిర్యాదులో వివరించారు. యువతి ఫిర్యాదుతో రాహుల్ సిప్లిగంజ్‌తో సహా మొత్తం 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో మధ్యవర్తిత్వం చేసిన కొందరు జర్నలిస్టులు, హైకోర్టు న్యాయవాది గీతా ప్రసన్న చందన కూడా ఉన్నట్లు సమాచారం. తొలుత ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, తదుపరి విచారణ నిమిత్తం దీనిని ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ దశలో ఉంది. యువతి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆరోపణలపై రాహుల్ సిప్లిగంజ్ నుంచి గానీ, ఆయన ప్రతినిధుల నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.




## జూనియర్ ఎన్టీఆర్ కుడి భుజానికి సర్జరీ!

ప్రముఖ తెలుగు సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. గత నెలలో తగిలిన గాయంపై వైద్యుల పర్యవేక్షణ అనంతరం, హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన బృందం ఒక ప్రకటనలో వెల్లడించింది. గత నెల జులై 27న ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్.ఎ. పురంచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఆయన్ను పరీక్షించి, గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచించారు. అప్పట్లో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ప్రతినిధులు ఒక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా ఎన్టీఆర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, "వైద్యుల సూచన మేరకు ఎన్టీఆర్‌కు రేపు కిమ్స్ ఆసుపత్రిలో భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. ఆయన త్వరగా కోలుకునేలా చూసేందుకు వైద్య బృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వెల్లడిస్తాం. మీ మద్దతుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ గాయం కారణంగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.



## డ్రామాలొద్దు.. పని చూసుకో

తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా.. వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది. మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467